RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 338 రంగారెడ్డి ఎడిటర్ : గంజి వెంకటేశ్ మంగళవారం, డిసెంబర్ 02, 2025 పేజీలు : 8 వెల: 3 రూ.

Volume: 03 Issue :338 Rangareddy Editor: Ganji Venkatesh Tuesday, December 02, 2025 Pages:8 Price: 3/-


## కారులో కుక్కతో పార్లమెంట్‌కు రేణుకాచౌదరి

- అభ్యంతరం చెప్పిన బిజెపి ఎంపిలు

న్యూఢిల్లీ,డిసెంబర్1(పద్మక్రాంతి ):

పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారంనాడు ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి కారులో ఒక కుక్కను పార్లమెంటు ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఇది గమనించిన భద్రతాసిబ్బంది ఆ కుక్కను తిరిగి ఆమె నివాసానికి పంపేశారు. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇది ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలను దుర్వినియోగం చేయడమమే అవుతుందని విమర్శించింది. అయితే దీనిపై రేణుకా చౌదరి ఘాటుగా స్పందించారు. 'ఒక మూగజీవి కారులో ఉంటే వారికి ఎందుకు అంత ఇబ్బంది? దీనిపై ఏదైనా చట్టం ఉందా? నేను వస్తుండగా దారిలో ఒక స్కూటరు, కారు ఢీకొన్నాయి. చిన్న కుక్క రోడ్డుపై తిరుగుతోంది. దానికి దెబ్బతగిలి ఉంటుందని అనిపించి దానిని కారులో ఎక్కించుకున్నాను. నేరుగా పార్లమెంటుకు వచ్చాను. వెంటనే దాన్ని వెనక్కి పంపించేశాను. మేము మూగజీవాలను ప్రేమిస్తాం. పార్లమెంటులో కూర్చుని ప్రతిరోజూ మాపై విరుచుకుపడే వాళ్ల గురించి మేము మాట్లాడదలచు కోలేదని అన్నారు. రేణుకాచౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టారు.

## దశాబ్దాల జిల్లా కరువును
# పారదోలుతా



- బూర్గుల తరవాత నాకే అవకాశం ఇచ్చారు
- గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తీవ్రనిర్లక్ష్యం
- ఉమ్మడి ఎపిలోనూ..తెలంగాణలోనూ జిల్లా నిర్లక్ష్యం
- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తా
- సర్పంచ్‌లుగా మనవారినే గెలిపిస్తే మంచిది
- మక్తల్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

నారాయణపేట,డిసెంబర్1(పద్మక్రాంతి ):

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్లపాటు గత బిఆర్ఎస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నేత కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది. రెండేళ్ల విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆ తర్వాత 75 ఏళ్లలో ఎవరూ కాలేదు. ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ రాష్ట్ర సీఎంగా మీ ముందు నిలబడ్డారు. పాలమూరుకు ఏది కావాలన్నా చేసి మీ రుణం తీర్చుకుంటానని అన్నారు. దశాబ్దాలుగా పాలమూ-రు జిల్లా కరవు, వలసలకు మాత్రమే పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీగా చేసిన మాజీ సీఎం కెసిఆర్ కూడా ఈ జిల్లాకు ఏం చేయలేదు. ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. ఈసారి పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని సీఎం రేవంత్ అన్నారు.

3 లో



## ఓటమిని కూడా అంగీకరించలేని విపక్షం

- సమస్యలపై చర్చకు ఎప్పుడూ సిద్ధమే
- సభా సమయాల్లో డ్రామాలు వద్దు....
- విపక్షాలకు ప్రధాని మోడీ చురకలు

న్యూఢిల్లీ,డిసెంబర్1(పద్మక్రాంతి ):

బీహార్ పరాజయాన్ని కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ప్రతిపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఆయన సూచించారు. ఈ మేరకు ప్రతిపక్ష ఇండియా కూటమిపై నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం పార్లమెంట్ ఆవర-ణలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ సమావేశాల్లో అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'సమావేశాలు సజావుగా ముందుకు సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలి. సభా సమయాల్లో డ్రామాలు వద్దు. చట్టసభల్లో సమ-

3 లో

## 11 ఏళ్లుగా ప్రభుత్వం అణచివేత ధోరణి



- గత సమావేశాల్లో హడావిడిగా 12 బిల్‌లు ఆమోదం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ విపక్షనేత ఖర్గే
- ధన్‌కడ్‌కు ఉచిత వీడ్కోలు దక్కలేదని రాజ్యసభలో ప్రస్తావన
- ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ,డిసెంబర్1(పద్మక్రాంతి ):

3 లో



## శ్రీలంకపై విరుచుకుపడ్డ దిత్వా తుఫాన్

- ఇప్పటికే 334 మంది మృతి... మరో 370మంది గల్లంతు

కొలంబో,డిసెంబర్1(పద్మక్రాంతి ):

తుపాను శ్రీలంకపై విరుచుకుపడింది. తుపాను ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 334మంది మ-రణించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. మరో 370మంది గల్లంతయ్యారని అన్నారు. బదుల్లా, నువారా, ఎలియా మరియు మటలే జిల్లాల్లో ఆదివారం అధిక సంఖ్యలో మరణాలు నమోదయ్యాయని అన్నారు. కొండచరియలు విరిగిపడటంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారని అన్నారు. సుమారు 11లక్షలకు పైగా ప్రజలు తుపానుతో తీవ్రంగా ప్రభావితమయ్యారని, సుమారు 2 లక్షలమంది నిరాశ్రయులయ్యారని విపత్తు నిర్వహణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. దిత్వా తుఫాను కారణంగా శ్రీలంకలోని అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయని, పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నిషేధిత జోన్‌లో చిక్కుకున్న ప్రయాణికులను తరలించేందుకు తమ హెలికాప్టర్లు శ్రీలంక అధికారులతో కలిసి హైబ్రిడ్ రెస్క్యూ మిషన్ చేపట్టాయని భారత వైమానిక దళం తెలిపింది. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె తెలిపారు.



## హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

- 9 వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి
- ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా

## హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం



- గతంలో బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జివో అమలు
- కాలుష్య నియంత్రణకు పరిశ్రమలు తరలిస్తున్నాం: శ్రీధర్ బాబు

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు.

3 లో



## చురుకుగా మేడారం అభివృద్ధి పనులు

- గద్దెల చుట్టూ పచ్చదనం..ఫ్లడ్లైట్ల ఏర్పాటు
- పనులను సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు

3 లో

## డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు చేయండి

సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ,డిసెంబర్1(పద్మక్రాంతి ):



డిజిటల్ అరెస్ట్‌లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సీరియస్ అయింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు ప్రారంభించాలని సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తునకు సీబీఐ ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బగ్చి నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును సుమోటోగా తీసుకుని విచారించింది. విచారణ సందర్భంగా సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. దేశంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారులమంటూ జనాలను భయపెట్టి డబ్బులు దోచేస-్తున్నారు. 2025లో డిజిటల్ అరెస్ట్ కేసుల సంఖ్య బాగా పెరిగిపోయింది. పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్లు, సెలెబ్రిటీలు సైతం డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల బారిన పడుతున్నారు. లక్షలు, కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దృష్టి సారించింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు అల్పడుతున్న

3 లో

## విద్యుత్‌లో రూ.50వేల కోట్ల స్కాంకు తెర

- కొత్త డిస్కమ్..థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంలో కమీషన్లు
- విద్యుత్ శాఖను ఎపి ప్రభుత్వం నడుపుతోందా?
- ఎన్టీపిసి తక్కువ రేట్లకే విద్యుత్ ఇస్తామంటే తీసుకోరా
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):



విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటికే ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉండగా కొత్త డిస్కమ్ ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్షన్‌లోనే రేవంత్ యాక్షన్ చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్లను దండుకునేందుకే ఇలాంటి స్కామ్‌లకు తెరదీశారు. ఇలా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.50వేల కోట్ల స్కాంకు తెరలేపిందని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. థర్మల్ విద్యుత్‌ను తగ్గిస్తామన్న ప్రభుత్వం.. కొత్త ఎ÷-లాంట్లు ఎందుకు నిర్మిస్తోందని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అధికారులను అవమానించిన కుమార్ రాజాను వెంటనే తరిమికొట్టాలని హెచ్చరించారు.అండర్ గ్రౌండ్ కేబుల్స్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ కరెంట్ సహా ఇంటర్‌స్టేట్ స్కామ్‌నూ త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతాం అని తెలిపారు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.50 వేల కోట్ల స్కాంను బయటపెట్టినందుకే తనను టార్గెట్ చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. థర్మల్ విద్యుత్ ను తగ్గిస్తామని చెప్పి కొత్త ప్లాంటు ఎందుకు కడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కమిషన్ల కోసమే కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. రూ.10,800 కోట్లతో జెన్కో డీపీఆర్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ వాళ్లు రూ. 4.12 పైసలకు యూనిట్ ఇస్తామంటే ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు .ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నించారు. రామగుండం కొత్త థర్మల్ ప్రాంట్ తో రోజూ ప్రజలపై రూ. 9 కోట్ల భారం పడుతుందని చెప్పారు. 25 ఏండ్లకు కొత్త ప్లాంట్ తో ప్రజలపై రూ. 82 వేల కోట్ల

3 లో

## సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసి చూపాం



- పెన్షన్ల పంపిణీ ఎపిలోనే ఎక్కువ
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్నాం
- అమరావతిని పరుగులు పెట్టిస్తున్నాం
- గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి
- మహిళలకు ఉచితబస్సు, సిలిండర్లు ఇస్తున్నాం
- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో సిఎం

3 లో

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# అప్పులు తీర్చే మార్గాలు ఏవీ !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి కొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడి దాదాపు పుష్కరకాలం కావస్తోంది. రెండు రాష్ట్రాల్లో ఇద్దరు సిఎంలు, కొన్ని పొలిటికల్ పదవులు, డిజిపిలు, సిఎస్‌లు ఏర్పడ్డా ఈ రెండు రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధి శూన్యం. ఉమ్మడి ఎపిగా ఉన్ననాటికి నేటికి..సాధించిన అభివృద్ధి ఏదయినా ఉందంటే అది అప్పులు మాత్రమే. రాజకీయ నేతలకు పాలన చేతగాకపోవడం వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు దాదాపు 15లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయాయి. ఈ అప్పులు ఏ అభివృద్ధికి తార్కాణమో పాలకులు చెప్పాలి. దీనికి ఎవరు బాధ్యులో చెప్పాలి. ఉచిత పథకాలతో రాష్ట్రాలను దివాళా తీయిస్తున్న పాలకుల తీరు వల్ల రాష్ట్రాలు ఎప్పటికీ అభివృద్ధి చెందవు. ప్రజలు కడుతున్న విలువైన ట్యాక్స్ మొత్తాలను ఇలా దుబారా చేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలే ఆలోచన చేయాలి. ఎంతకాలమిా ఉచిత పథకాలు ఇస్తారో చెప్పాలి. దీనిని ఏ రకమైన అభివృద్ధి అంటామో కూడా తెలపాలి. ఎందుకంటే రోడ్లు వేయడానికి నిధులు లేవు. అభివృద్ధి పనులకు నిధులు లేవు. సకాలంలో జీతాలు, పెన్షన్లకు నిధులు లేవు. స్కూళ్లు, వైద్యశాలలు కునారిల్లుతున్నాయి. పన్నులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. దక్షుడు లేని ఇంటికి పదార్థ వే లక్షలు వచ్చినా..అన్న శతకకారుడి పద్యం ఇప్పుడు ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు బాగా సరిపోతుంది. కిలో రూపాయికే బియ్యం, పెన్షన్లు, ఉచితబస్సు, ఉచిత విద్యుత, ఉచిత సిలిండర్, ఉచితంగా ఇళ్లు..ఇలా ఇంచుమించుగా ఇలాంటి పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఇదే అభివృద్ధిగా చెబుతూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. పెన్షన్లు పంచడానికి ఎపిలో సిఎం చంద్రబాబు హెలికాప్టర్ వేసుకుని తిరుగుతున్నారు. ఇంతదండగ మారి ఖర్చు ఎందుకో బాబు చెప్పాలి. హెలికాప్టర్ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇక తెలంగాణలో పదేళ్ల కేసిఆర్ పాలన అప్పులకుప్పగా నిలిచింది. వాటిని సరిచేసుకుని అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిన రేవంత్ సర్కార్ కూడా ఉచిత పథకాలను రద్దు చేయలేకపోతున్నది. ఓట్లు పోతాయన్న భయంతో ఈ పథకాలు కొనసాగిస్తున్నారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడమే పెద్ద దగా అనుకుంటే ..సన్నబియ్యం ఇవ్వడం పెద్ద సంస్కరణగా చెప్పకుంటున్నారు. ఇక దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇటీవల కేంద్రానికి సిఎం రేవంత్ సూచించారు. ఇలాంటి పథకాలు ప్రజలు సోమరులై, ఇళ్లల్‌ఓ కూర్చుని పనులకు పోకుండా ఉంటున్నారు. గ్రామాల్లో లేబర్ కావాలన్నా దొరకడం లేదు. వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా ఎవ్వరూ పెద్దగా చర్చించడం లేదు. ఇకపోతే రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా, ఈ విజన్ పాలసీ లక్ష్యాలు, ప్రణాళికలపై చర్చిస్తున్నారు. నిజానికి మిగులు ఆదాయం లేకుండా, అప్పులను ఎలా తీర్చాలో తెలప కుండా, ఉచిత పథకాల నుంచి గట్టెక్కడం ఎలాగో చెప్పకుండా తెలంగాణను 2037 వరకు 1 ట్రిలియన్ ఎకానమిగా మారుస్తామని ప్రకటించడం దారుణం. అంతేనా అంటే ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరోటి కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సిఎంలు ఇద్దరూ అప్పులను తీర్చేందుకు ఉపాయాలు కోరడం లేదు. అప్పుల ఊబినుంచి బయటపడే ప్రయత్నం చేయడం లేదు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమిగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం అని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా ప్రకటించుకుంది. ఈ లక్ష్యాలను సాధించేందుకు వీలుగానే మేము తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో ముఖ్యంగా సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా

చూస్తున్నామని, వాటి మధ్య సమతుల్యతను కొనసాగించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విజన్ డాక్యుమెంట్ నాలుగు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొంటు న్నారు. దాని రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించారు. దాదాపు 4 లక్షల మంది ప్రజల సూచనలు, ముఖ్యంగా యువకుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నా మని చెప్పారు. అంతేకాకుండా, అన్ని రంగాల్లోని మేధావులు, నిపుణులతో ఇప్పటివరకు దాదాపు 70 సమావేశాలు ఏర్పాటు చేశామని, అందరి అభిప్రాయాలను తీసుకున్న తరువాతే విజన్ డాక్యుమెంట్‌ను తుదిరూపు ఇస్తున్నామని తెలిపారు. మూడు ట్రిలియన్ ఎకానమిని ఎలా సాధ్యం చేయాలి అనే అంశాలపై ఇప్పటికే తమ బృందం విస్తృత కసరత్తు చేసిందని వివరించారు. ఈ విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్‌లో అధికారికంగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. పెట్టుబడులతో పాటు, కీలకమైన సలహాలు ఇవ్వడానికి చాలా మంది పారిశ్రామిక వేత్తలు ఈ గ్లోబల్ సమ్మిట్‌కి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు. అయితే గ్రోత్ ఎలా ఉన్నా..ప్రస్తుతం ప్రభుత్వాలు నడపడానికే కనాకష్టంగా ఉంది. ఈ క్రమంలో తెలంగాణలొ విలువైన ప్రభుత్వ ఆధీనంలోని భూములను తెగనమ్ము తున్నారు. భవిష్యత్ అవసరాలకు భూములు లేకుండా చేస్తున్నారు. ఎపిలో పోలవరం ఇంకా పూర్తి కాలేదు. జగన పోతూపోతూ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. రాజధాని అమరావతికి ఇంకా భూసేకరణ చేస్తున్నారు. లక్ష ఎకరాలు టార్గెట్‌గా బాబు అడుగులు వేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించకుండా విన్యాసాలు చేస్తూ, అధికారం అనుభవిస్తూ ఐదేళ్లు గడపడం పాలకులు అలవాటు చేసుకున్నారు. ఈ ఐదేళ్లలో ఇలాంటి సాధ్యం కాని ప్రయత్నాలు చేయడం,ప్రజలను మభ్య పెట్టడం చూస్తున్నాం. ఉమ్మడి ఎపి విడివడ్డాక తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్, చంద్రబాబులు చెప్పుకోదగ్గ ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేసిన దాఖలాలు శూన్యం. అప్పులు తీర్చే సమర్థత లేని నేతలు ఎన్ని చెప్పినా నమ్మడానికి లేదు. వీరు చేస్తారన్న భరోసా రాదు.

# తెలంగాణ రైజింగ్‌తో ఆర్థికాభివృద్ధి సాధ్యమేనా ?

- లక్ష్యాలను అనుకున్నట్లుగా తీసుకెళ్లే సామర్థ్యం ముఖ్యం

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తఇచేసుకోబోతోంది. ఈ క్రమంలో 'తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్' రూపొందిస్తోంది. భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలు. అభివృద్ధిపై ఇందులో ప్రస్ఫుటంగా ప్రస్తావించ నున్నారు. ఏరకంగా ముందుకు వెళుతున్నదీ వివరించనున్నారు. అయితే ఇది అంత ఆషామాషీ విషయం కాదు. ఇప్పటికే నిధుల కొరత, అప్పుల ఊబిలాంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించాలి. ఇందుకు ఆర్థిక కట్టుబాట్లు కూడా అవసరం. ఇవన్నీ లేకుండా ఇంత పెద్ద లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం అంత సులువు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశారు. గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు ప్రకటించారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. విజన్‌లో భాగంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు విభాగాలుగా విభజించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమిగా పరిగణించబోతున్నారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్ఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి–అర్బన్ రీజియన్ ఎకానమిగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్ఆర్ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని, ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్‌గా మారుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్–బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేసస్తున్నామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఆర్ఆర్ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమిగా గుర్తించారు. ఆదాయం పెంచాలి? పేదలకు పంచాలి అనేది తమ ప్రభుత్వ విధానమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఎయిర్‌పోర్టుల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవన్నీ సకారాం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. అయితే ఇది ఎంతవరకు సాకారం అవుతుందన్నది ప్రభుత్వ చిత్తశుద్ధిని పట్టి ఉంటుంది.





# శ్రీరంగనాధుడికి టిటిడి పట్టువస్త్రాలు సమర్పణ

తిరుమల,డిసెంబర్1(పద్మక్రాంతి ):

తమిళనాడు శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామివారికి సోమవారం టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి చైర్మన్‌కు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ పి.శివరామన్, ప్రధానార్చకులు సుందరభట్టర్ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను చైర్మన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నరేష్ కుమార్, పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడుతున్న

# నిషేధిత సంస్థ సభ్యులు

- ముగ్గరుని అరెస్ట్ చేసిన భద్రతా బలగాలు

ఇంఫాల్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

దోపిడీలకు పాల్పడుతున్న వివిధ నిషేధ సంస్థలకు చెందిన ముగ్గురు సభ్యులు సహా ఏడుగురిని భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కామ్జోంగ్ జిల్లాలోన్ని కో అవుట్‌పోస్ట్‌లో నిర్వహించిన సాధారణ తనిఖీల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారి నుండి లెక్కచూపని రూ.57లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ నలుగురు ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నారని అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్ (పిఆర్‌ఇపిఎకె)కి చెందిన ఒక సభ్యుడిని ఆదివారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని ఖగేంపల్లిలో అతని నివాసం నుండి అరెస్ట్ చేశారని అన్నారు. అతను వైద్యులు, ఆస్పత్రులు, స్కూల్ వ్యాన్ అసోసియేషన్‌లు, పాఠశాలలు, బేకరీ దుకాణాలు, జిమ్‌లపై దోపిడీకి పాల్పడ్డాడని తెలిపారు. నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఇద్దరు క్రియాశీల సభ్యులను ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కాంగ్లా స్గి÷ మరియు తౌబాల్ జిల్లాలోని ఇంగౌరోక్ నుండి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

# రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఆత్మహత్య కాదది.... ప్రభుత్వ హత్యే
- ఎక్స్ వేదికగా హరీష్ రావు ఆరోపణ



హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ ఘటనపై స్పందించిన అయన రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు.సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేసస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

# హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):

హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. 'హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్‌ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయని నేతలు ఆరోపించారు.

అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ది పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వ వైఫల్యాను వ్యతిరేకంగా 7న నిరసన దీక్ష చేపట్టబోతున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

# దశాబ్దాల జిల్లా కరువును పారదోలుతా

మొదటి పేజీ తరువాయి ..

కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ఆ అప్పులు తీరుస్తూనే.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లను గెలిపిస్తే.. గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం. పదేళ్ల నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాం. ఈ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చాం. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా.. ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని.. ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌లను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం అని సిఎం రేవంత్ అన్నారు. మక్తల్ పర్యటనలో భాగంగా రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనాలు, మక్తల్- నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు, మక్తల్‌లో క్రీడాభవనం తదితర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి జిల్లా ఆత్మకూరులో పర్యటించారు. రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూరాల దిగువన హైలెవల్ వంతెన నిర్మాణం, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు-69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. 'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చాం.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం.

మొదటి పేజీ తరువాయి ..

## చురుకుగా మేడారం అభివృద్ధి పనులు

జారీ చేశారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు చేయండి

అల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టురట్ట యింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో జనాలను మోసం చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీబీఐ, ఈడీ అధికారులమంటూ కేటుగాళ్లు 48 లక్షల రూపాయలు కాజేశారు. పోలీసులు నిందితుల నుండి 32 లక్షల రూపాయల నగదు 25 ఏటీఎమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

## హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం

ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో రైతులకు సంబంధించిన భూములు లేవన్నారు. ఇకపోతే బిఆర్ఎస్ తెచ్చిన జీవోనే తాము ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు. నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలన్న ఉద్దేశ్యంతోనే నగరంలో బాలానగర్, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్‌కు ఆవలకి తరలిస్తున్నామని అన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసి చూపాం

మొదటి పేజీ తరువాయి ..

ఏలూరు,డిసెంబర్1(పద్మక్రాంతి ): సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పింఛన్లకు ఏపీ కంటే ఏ రాష్ట్రం కూడా ఎక్కువ ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లాలోని గోపీనాథపట్నంలో చంద్రబాబు పర్యటించారు. మహిళ నాగలక్ష్మికి పెన్షన్ అందజేశారు. నల్లమాడులో స్టాళ్లను సీఎం, మంత్రులు పరిశీలించారు. అనంతరం ప్రసంగించారు. తాను, తన మిత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఒకే విధంగా ఆలోచిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేసే పనిలో ఉన్నామన్నారు. సుపరిపాలనకు నాంది పలుకుతామని ముందే హామీ ఇచ్చామని, ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. గ్రామసభలు అంటే మొక్కుబడిగా నిర్వహించడం కాదని, ఒక మార్పు రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనుల వివరాలన్నీ సచివాలయంలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వమిది. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించాం. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు ఇస్తే.. అవి అసాధ్యమన్నారు. వాటిని సక్సెస్ చేశాం. 18




నెలల్లో పింఛన్ల కోసమే రూ. 50వేల కోట్లు ఖర్చు పెట్టాం. ఐదేళ్లలో రూ. 1.65లక్షల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో పింఛన్ల ఖర్చు లేదు. ఒకప్పుడు ఒక నెల పింఛను తీసుకోకపోతే వాటిని ఇచ్చేవారు కాదు. ఇప్పుడు 2,3 నెలల పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు అమలు చేస్తున్నాం అని వివరించారు. మహిళలకు స్త్రీశక్తి ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. రైతాంగం ఆదాయం మెరుగవ్వడం కోసం పంచసూత్రాలు అమలు చేస్తున్నాం. త్వరలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం. పోలవరం కుడి కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు ఇస్తాం. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ఏయే పంటలు వేయాలి? ఏ మందులు వాడాలి? నీటి సంరక్షణ తదితర వివరాలు తెలియజేస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన మాట అమలు చేసి చూపుతున్నాం అన్నారు. ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలను ప్రోత్సహిస్తున్నాం. రాయితీలు ఇస్తాం. ప్రతి జిల్లాల్లో పరిశ్రమలు రావాలి.. కుటుంబానికో పారిశ్రామికవేత్త రావాలి. వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలు తీసుకొస్తాం. కొల్లేరు సరస్సు సమస్య.. ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. దానికి పరిష్కారం చూపుతాం. 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం అని పునరుద్ఘాటించారు. అమరావతి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2028 నాటికి మొదట దశ పనులు పూర్తవుతాయి. ప్రపంచంలోనే ఇదొక సుందర రాజధాని అవుతుంది. రోడ్ల విషయంలో సమస్యలున్నాయి. జనవరిలోపు రోడ్లపై ఉన్న గుంతలు పూడుస్తామని హామీ ఇస్తున్నా. పవన్ కల్యాణ్ ఒక మాట పదేపదే చెబుతుంటారు. మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని అంటుంటారని చంద్రబాబు తెలిపారు. తమ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వందమందిలో పదమూడు మందికి పెన్షన్లు ఇస్తున్నామని.. వారిలో 59శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. తమ ప్రభుత్వానికి కష్టాలు, అప్పులు ఉన్నాయని, ఆదాయం లేదని.. అయినా ఒకేసారి రూ.4వేలకు పింఛన్లు పెంచామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ముక్కుతూ, మూలుగుతూ రూ. 250ల చొప్పున పెంచిందని విమర్శించారు. జనాభాను పెంచాల్సిన అవసరం ఉందని.. లేకపోతే మిషన్లతో పనిచేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1650 కోట్లు బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. ఆ బకాయిలను తీర్చడమే కాదని, ఇప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నాలుగు గంటల్లో పైసలు ఇస్తున్నామని వివరించారు. 25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకున్నారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు రూ.550 కోట్లు ఉచిత బస్సు పథకానికి ఖర్చు చేశామని వెల్లడించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. ఇదిలావుంటే ఏలూరు కలెక్టర్ పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా తానే గ్రామసభ నిర్వహిస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రజాసమస్యలపై సిబ్బంది కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని కలెక్టర్ వెట్రి సెల్వినీ సీఎం ప్రశ్నించారు. ఒక గ్రామంలో ఎన్ని టాయిలెట్స్, ఎన్ని ఇళ్లు ఉన్నాయనే కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆదాయం పెరిగే విధంగా అధికారులు ఆలోచించాలని సూచించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సిఎంకు పలువురు స్వాగతం పలికారు.

## విద్యుత్‌లో రూ.50వేల కోట్ల స్కాంకు తెర

శాఖలో తెలంగాణ ప్రాంత అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషన్ల కోసమే కొత్త విద్యుత్ ఎ÷-లాంట్లు నిర్మిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఎన్టీపీసీ.. రూ.4.12పైసల్లకు యూనిట్ విద్యుత్ ఇస్తామంటే తీసుకోవడానికి కాంగ్రెస్ సర్కార్ ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్టీపీసీ 2,400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రాలేదు? అని నిలదీశారు హరీశ్‌రావు. ఎన్టీపీసీ ఇచ్చే తక్కువ ధర కరెంటును కాదని.. సొంతంగా విద్యుత్ ప్లాంట్లు ఎందుకు ఏర్పాటు చేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే విద్యుత్ రంగంలో ఈ దుస్థితి నెలకొందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖను తెలంగాణ ప్రభుత్వం నడుపుతుందా..? లేదా ఏపీ ప్రభుత్వం నడుపుతుందా? అని ఎద్దేవా చేశారు. విద్యుత్ శాఖలో తిష్టవేసుకుని కూర్చున్న ఆంధ్ర ప్రాంత అధికారులను వెంటనే సాగనంపాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్పంచ్ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్లను సీఎం పరోక్షంగా ప్రభావితం చేస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుంటే..

పట్టణాల్లో సీఎం తిరుగుతానంటే ఎలా అని నిలదీశారు హరీశ్‌రావు.

## 11 ఏళ్లుగా ప్రభుత్వం అణచివేత ధోరణి

మొదటి పేజీ తరువాయి ..

పార్లమెంటరీ మర్యాదలను, పార్లమెంటరీ వ్యవస్థను గత 11 ఏళ్లుగా ప్రభుత్వం అణిచివేస్తూనే ఉందని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారని, కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారని గుర్తుచేశారు. జీఎస్టీ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, రైతు వ్యతిరేక చట్టాలు పార్లమెంటు ద్వారా ప్రభుత్వం బుల్డోజింగ్ చేసిన బిల్లులని ఆక్షేపణ తెలిపారు.పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని, వాళ్లు వ్యూహం మార్చుకుంటే కొన్ని 'టిప్స్' ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సభా సమయాల్లో మాత్రం డ్రామాలు వద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. శీతాకాల సమావేశాల తొలి రోజే పార్లమెంటు ముందున్న కీలక అంశాల గురించి మోదీ ప్రస్తావించే బదులు నాటకీయ ప్రసంగం సాగించారని ఖర్గే తప్పుపట్టారు. 11 ఏళ్లుగా పార్లమెంటరీ మర్యాదలు, వ్యవస్థను ప్రభుత్వం అణిచివేస్తోం దన్నదే అసలు నిజమని అన్నారు. మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశాస్వ తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయిందని, ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒత్తిడికి గురై బీఎల్ఓలు చనిపోతే ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపులేదని విమర్శించారు. 'ఓటు చోరీ' వంటి కీలకాంశాలను విపక్షం లేవనెత్తుతూనే ఉంటుందని, ప్రభుత్వం డ్రామాలు కట్టిపెట్టి పార్లమెంటులో ప్రజాసమస్యలపై చర్చకు ముందుకురావాలని సూచించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత్వం, దేశ విలువైన వనరుల లూటీ వంటివి నిజమైన ప్రజాసమస్యలనీ, అయితే అధికారంలో ఉన్న వారు అధికార దురహంకారంతో డ్రామాలాడుతున్నారని ఖర్గే విమర్శించారు. బిహార్ ఓటమి నుంచి వాళ్లు బయటకు రావడం లేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ, ప్రతికూల ధోరణి రాజకీయాల్లో పనికొస్తుందే కానీ జాతి నిర్మాణానికి సానుకూల ఆలోచనా దృక్పథం అవసరమని, ప్రతికూలతా ఆలోచలను ప్రభుత్వం పక్కనపెట్టి జాతినిర్మాణంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ ఇవాళ రాజ్యసభ చైర్మెన్‌గా తొలిసారి బాధ్యతలు నిర్వర్తించారు. చైర్మన్ చైర్ లో ఆయన కూర్చున్న సమయంలో ఖర్గే మాట్లాడారు. రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికిన ఆయన తన ప్రసంగంలో మాజీ చైర్మెన్ జగదీప్ ధన్‌కర్ అంశాన్ని ప్రస్తావించారు. అనారోగ్య కారణాల వల్ల రాజ్యసభ మాజీ చైర్మెన్ జగదీప్ ధన్‌కర్ తన పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశాన్ని సోమవారం రాజ్యసభ ఎంపీ మల్లిఖార్జున్ ఖర్గే లేవనెత్తారు. జగదీప్ ధన్‌కర్‌కు సరైన రీతిలో వీడ్కోలు దక్కలేదని, దీని పట్ల బాధగా ఉందని ఖర్గే అన్నారు. ధన్‌కర్ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఖర్గే ఆరోపణలకు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్ ఇచ్చారు. ధన్‌కర్ రాజీనామా ఓ పవిత్ర సందర్భమన్నారు. గతంలో ధన్‌కర్ పట్ల విపక్షాలు అనుచిత రీతిలో ప్రవర్తించినట్లు రిజిజు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత ఈ సమయంలో ఎందుకు ఆ అంశాన్ని ప్రస్తావించారని అడిగారు. మాజీ ఉపరాష్ట్రపతిని తమ భాషతో అవమానించారన్నారు. ధన్‌కర్‌ను తొలగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ విషయాన్ని తామేమీ మరిచిపోమని రిజిజు అన్నారు. ధన్‌కర్ రాజీనామా గురించి మాట్లాడవద్దు అని, చైర్ హుందాతనాన్ని ఎంతగా దిగజార్చారో తెలుసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రతి ఒక్కర్నీ గౌరవించాలని, ఇది చాలా దురదృష్టకరమన్నారు.

## ఓటమిని కూడా అంగీకరించలేని విపక్షం

మొదటి పేజీ తరువాయి ..

చర్చలు తప్పనిసరి. దేశ ప్రగతి కోసం పార్లమెంటులో మంచి చర్చలు కొనసాగాలి. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. పరాజయం కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదు. మేము మాత్రం విపక్షాలను కలుపుకొని ముందుకెళ్తాం. దేశాభివృద్ధి కోసం విపక్షాలు కూడా మాతో కలిసి రావాలి. అన్ని అంశాలపై సానుకూల ఖచర్చలు జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి' అని ప్రధాని పేర్కొన్నారు.బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమమ్యాయి. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.ఈ పార్లమెంట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని చట్టసభ సభ్యులను విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. అవి తమ బాధ్యతను నిర్వర్తించాలి. బలమైన అంశాలను లేవనెత్తాలి అని మోదీ సూచించారు. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని ప్రధాని విపక్షాలకు చురకలంటించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈసారి పార్లమెంట్ సెషన్ కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు బాటలు పరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకాగా, ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించవద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి దాదాపు 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

మంగళవారం, డిసెంబర్ 02, 2025

పద్మక్రాంతి (వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

RNI No : TELTEL/2022/85167

## గ్రామ పాలన అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జర్పలవత్ వినయ్..

పద్మక్రాంతి, డిసెంబర్ 1,( కల్వకుర్తి ప్రతినిధి ):



నాగర్ కర్నూలు జిల్లా గ్రామ పాలన అధికారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్య తండాకు చెందిన వినయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వినయ్ ప్రస్తుతం వెల్దండ మండలం కొట్ర క్లస్టర్ కు గ్రామ పాలన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు . గ్రామ పాలన అధికారుల ఆవిర్భావ సభ తెలంగాణ గ్రామ పాలన అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో నన్ను ఎన్నుకున్నట్టు తెలిపారు. వినయ్ మాట్లాడుతూ తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడంతో నాతోటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు గతంలో విద్యార్థి సంఘం నేతగా పనిచేసిన అనుభవంతో ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు.

## రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జడ్పీహెచ్ఎస్ మార్చాల క్రీడాకారిణి ఎంపిక...

పద్మక్రాంతి, డిసెంబర్ 1, (కల్వకుర్తి ప్రతినిధి)



గత నెలలో నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో యం జె పి జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ బాలికల సెలక్షన్స్ లో డి. మౌనిక పదవ తరగతి జెడ్పిహెచ్ఎస్ మార్చాలా క్రీడాకారిని పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగినది ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలు డిసెంబర్ 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలోని హాలియా లో జరుగుతున్న 51వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలలో నాగర్ కర్నూల్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు యాదయ్య గౌడ్ తెలిపారు

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారిణి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## గ్రామానికి దూరంగా వైన్ షాపు ఏర్పాటు చేయాలి.

- ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతి.




కొమరం భీమ్ ఆసిఫాబాద్, డిసెంబర్ 01,(పద్మక్రాంతి ప్రతినిధి ):

కొమరం భీమ్ జిల్లా కాగజ్నగర్ మండలంలోని ఇస్ గాం. నజ్రుల్ నగర్ పరిధిలోని ఏర్పాటు చేస్తున్న వైన్ షాప్ ని గ్రామానికి 500 మీటర్లు దూరంలో ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గ్రామ మహిళలతో కలిసి కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వినోద,నాయకులు షాహినీ సుచిత్ర మాట్లాడుతూ. నజురులు నగర్ గ్రామపంచాయతీ కి కేటాయించిన వైన్ షాపు గతంలో పెంచికలపేట మెయిన్ రోడ్డుకు పంచశీల నగర్ లో ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఆ షాపును ఇంకా 500 మీటర్లు ముందుకు జరిపి ఇండ్ల మధ్యలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వైన్ షాపును ఏర్పాటు చేస్తున్నారు, ఇండ్ల మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల . మందుబాబుల వలన మహిళలకు, విద్యార్థులకు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు సాయంత్రం పూట జన సాంద్రత ఎక్కువ ఉండే ప్రాంతం కాబట్టి మందు బాబుల వలన మహిళలకు, విద్యార్థులకు అసభ్యంగా ప్రవర్తించే అవకాశం ఉంది కావున ఇ వైన్ షాప్ నజురుల్ నగర్ గ్రామపంచాయతీకి 500 మీటర్లు దూరంగా నామ నగర్ వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసి మహిళలకు విద్యార్థినులకు మరియు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సుచిత్ర రానా,మమత రానా పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు తప్పవు

### - రామకృష్ణాపూర్ ఎ.స్సై జి .రాజశేఖర్

రామకృష్ణ పూర్ డిసెంబర్ 1 (పద్మక్రాంతి):




గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యులకు సంబంధించిన ఎలక్షన్లు జరుగుతున్న సందర్భంగా ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని ఎవరైనా మనోభావాలు దెబ్బ తీసేటట్లు అసభ్యకరమైన పోస్టులు సోషల్ మీడియా ద్వారా పెట్టిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని రామకృష్ణాపూర్ ఎ.స్సై జి .రాజశేఖర్ తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు సృష్టించిన వారిపైన ఎలక్షన్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విధంగా నమోదైన ఎలక్షన్ కేసులు ఈ ఎలక్షన్స్ అయిపోయినా కూడా పోలీస్ స్టేషన్ రికార్డులో ఉంటాయని కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకూడదని ఎన్నికల సమయంలో పోలీసు వారు చెప్పిన నియమాలు పాటించాలన్నారు. ప్రచార కార్యక్రమాలు చేసేటప్పుడు సంబంధిత అధికారుల నుండి పర్మిషన్ తీసుకున్న తర్వాతేనే ప్రచారం చేయాలని ప్రచారంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎలక్షన్ అనేది పార్టీలకు అతీతంగా జరుగుతాయని కాబట్టి వ్యక్తిగత విమర్శలు చేసుకోకూడదు అన్నారు. అభ్యర్థులు ప్రజలు పోలీసులకు సహకరించాలని రామకృష్ణాపూర్ ఎస్సై జి.రాజశేఖర్ కోరారు.

## సర్పంచ్ నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి..





పద్మక్రాంతి, డిసెంబర్ 1 (కల్వకుర్తి ప్రతినిధి):

కల్వకుర్తి నియోజకవర్గం లోని పలు మండలాల్లో రెండవ విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థులు ఖరారయ్యారు. కొన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరు,ముగ్గురు నామినేషన్లు వేయడంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేయడానికి పోటీపడుతున్నారని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఒకరే పోటీ చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తలకొండపల్లి , కడ్తాల్,ఆమనగల్ మండలాలలో పడకల్ ,మేడిగడ్డ , శంకర్ కొండ తండాలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న పడకల్ కాంగ్రెస్ అభ్యర్థి డోకూరు సునీత ప్రభాకర్ రెడ్డి, లింగారావుపల్లిలో కాసు శ్రీనివాస్ రెడ్డి, మేడిగడ్ లో మల్లేష్ నాయక్, శంకర్ కొండ తండాలో మంగ్లీ రాములు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు ,వార్డ్ మెంబర్స్ అందరూ భారీ మెజార్టీతో గెలుస్తున్నట్లు కసిరెడ్డి తెలిపారు.

### ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ కాంట్రాక్టు శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ

## కార్మికులకు వేతనాలు చెల్లించాలి.

- కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించి నూతన టెండర్లను వెంటనే పునరుద్ధరించాలి.
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్.

కొమరం భీమ్ ఆసిఫాబాద్, డిసెంబర్ 01,(పద్మక్రాంతి ప్రతినిధి):




ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయునున్న కాంట్రాక్టు శానిటేషన్,పేషంట్ కేర్,సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం 26,000 ఇవ్వాలని కోరుతూ సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ డిప్యూటీ సూపరిడెంట్ కృష్ణ కు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ మాట్లాడుతూ ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ టెండర్ల కాలపరిమితి సంవత్సరాలు ముగిసిందని, వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం 26,000 చెల్లించే విధంగా ఉండాలని అన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులకు ఈపీఎఫ్,ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని కార్మికులందరికీ అపాయింట్మెంట్ లెటర్స్,ఐడి కాళ్ళతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం డిసెంబర్ 2 నుంచి 4 వరకు ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమం ఉంటాయని అయినప్పటికీ ప్రభుత్వ స్పందించకుంటే ఈనెల 5వ తేదీన కోటిలోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ కాలే ముందు ధర్నా కార్యక్రమం ఉంటుందని, ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి,కోశాధికారి నగేష్, కార్మికులు కృష్ణ, నీల,రాజయ్య, గంగన్న, కమల,తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ ల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్.**

కొమరం భీమ్ ఆసిఫాబాద్, డిసెంబర్ 01,(పద్మక్రాంతి ప్రతినిధి ):





గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భద్రత ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేయాలని లక్ష్యంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ సోమవారం అంతర్ రాష్ట్ర సరిహద్దులో వాంకిడి మండలంలో ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ చెక్పోస్ట్ ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్పోస్ట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, విధులలో ఉన్న సిబ్బంది సరైన డ్యూటీ రోస్టర్ ప్రకారం క్రమబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, అక్రమ మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణా అయ్యే అవకాశం ఉంటుందని, చెక్ పోస్ట్ నందు డ్యూటీలో ఉన్న అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పి స్పష్టం చేశారు. ప్రతి వాహనం, వ్యక్తిని కచ్చితంగా, క్షుణ్ణంగా తనిఖీ చేసి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే వదిలిపెట్టాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులు, వాహనాలు, వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికలను స్వచ్ఛందంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## తిమ్మాపురం గ్రామ అభివృద్ధే ధ్యేయం





- భూ నిర్వాసితులకు అండగా ఉంటా
- సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల వెంకట్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, డిసెంబరు 1 (పద్మక్రాంతి) :

తిమ్మాపురం గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల వెంకటరెడ్డి అన్నారు.సోమవారం ఆయన గ్రామస్థులు, అభిమానులతో కలిసి ర్యాలీగా బయలు దేరి వడపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తిమ్మాపురం గ్రామ పంచాయతీకి సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎడ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ నృసింహ సాగర్ బస్వాపూర్ ప్రాజెక్ట్ కొరకు తిమ్మాపురం గ్రామం ముంపుకు గురి కావడంతో చాలా మంది నిరుపేద సన్న, చిన్నకారు రైతులు భూములు కోల్పోయారని, ఇప్పటివరకు ప్రభుత్వం ఆదుకోవడం లేదని అన్నారు..ప్రాజెక్ట్ లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు తాను అండగా ఉంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.అదే విధంగా తిమ్మాపురం గ్రామంలో రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, వీధి లైట్లు సరిగా లేవని, తనను సర్పంచిగా గెలిపిస్తే ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గా ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి భారీ మెజారిటీ తో గెలిపిస్తే ఊరు అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. ఈ నామినేషన్ భారీ ర్యాలీ లో ఓటర్లు,మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి ):



తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అ÷-దదెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.

## స్కూటీపై వెళుతున్న యువతిపై యాసిడ్ దాడి

- హుటాహుటిన ఎంజిఎంకు తరలింపు

హన్మకొండ,డిసెంబర్1(పద్మక్రాంతి):

హన్మకొండ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మరో యాసిడ్ దాడి ఘటన కలకలం రేపింది. ఒంటరిగా వెళుతున్నయువతిపై యాసిడ్ దాడి జరిగింది. కాజీపేట మండలం కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఓ యువతిపై యాసిడ్ దాడి జరిగింది. స్కూటీపై వెళ్తున్న యువతిని బండి ఆపి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకుల్లో ఒకడు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. దీంతో యువతి అరుపులకు స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని 108కి సమాచారం అందించారు. అనంతరం బాధితురాలిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మడికొండ పోలీసులు ఆరా తీశారు. ఎంజీఎంలో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. యువతి అయినవోలు మండలం వెంకటాపురంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నట్లు సమాచారం.

## పత్తి కొనుగోళ్లకు తొలగిన అడ్డంకి

- జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో తుమ్మల చర్చలు

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి):



పత్తి సేకరణకు అడ్డంకులు తొలిగాయి. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవతో జిన్నింగ్ మిల్లులు పత్తి కొనుగోళ్లకు అంగీకరించాయి. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పనున్నాయి.

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు వ్యతిరేకించడంతో ఇటీవల కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టి సారించి.. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చలు నిర్వహించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి.. నిబంధనల్లో మార్పులు చేసేందుకు అంగీకరించేలా ఒప్పించారు. దీంతో రాష్ట్రంలో నోటిఫై చేసిన మొత్తం 330 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు సీసీఐ మొత్తం 3.66 లక్షల టన్నుల పత్తిని సేకరించింది. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా ఇకపై సీసీఐ, జిన్నింగ్ మిల్లులు పనిచేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువజంట మృతి

రంగారెడ్డి,డిసెంబర్1(పద్మక్రాంతి):

రంగారెడ్డి జిల్లా కొత్తూరు పురపాలక కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. అనుమానస్పద స్థితిలో యువతీ యువకుడు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓ కార్మికుడు కొత్తూరు శివారులోని ఓ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వారిద్దరూ స్థానిక బిస్కెట్ పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం తండ్రి భోజనానికి ఇంటికి రాగా.. తలుపు గడియ లోపలి నుంచి పెట్టి ఉంది. ఎంతసేపు తలుపు కొట్టిన ఎవరు స్పందించలేదు. దీంతో కిటికీ నుంచి తలుపు గడియ తీసి లోపలికి వెళ్లాడు. ఓ గదిలో అతడి కుమార్తెతో పాటు మరో గుర్తు తెలియని యువకుడి మృతదేహాలను చూశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆ యువకుడు యువతిని హత్య చేసి ఆ తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

## అగ్నిప్రమాదంలో కూలీల గుడిసెలు దగ్ధం

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి):

చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవన నిర్మాణ సంస్థ వద్ద.. కార్మికులు వేసుకున్న గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. అక్కడ దాదాపు 50 గుడిసెలు ఉన్నట్లు తెలుస్తోంది. అవన్నీ కాలి బూడిద అయ్యాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ప్రమాదానికి గల కారణంగా తెలియ రాలేదు.

## ఢిల్లీకి చేరుకున్న లోకేశ్, అనిత

న్యూఢిల్లీ,డిసెంబర్1(పద్మక్రాంతి):



ఏపీ మంత్రులు నారా లోకేశ్, అనిత ఢిల్లీ చేరుకున్నారు. లోకేశ్, అనిత మంగళవారం కేంద్రమంత్రులు అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలవనున్నారు. పార్లమెంట్‌లో వారితో సమావేశ-మై ఏపీలో మొంథా తుపాను నష్టంపై వివరించనున్నారు. ఈ భేటీలో మంత్రులతో పాటు తెదేపా ఎంపీలు పాల్గొననున్నారు. వివిధ అంశాలపై కేంద్రమంత్రులతో చర్చించనున్నారు. ఈసందర్భంగా వీరికి తెదేపా ఎంపీలు స్వాగతం పలికారు. మంత్రుల వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు ఉన్నారు.



## గ్లోబల్ సమ్మిట్ పూర్తి కానీ పనులను వేగవంతగా పూర్తి చేయాలి.

- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్
- ఐఏఎస్ శశాంక.

రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 1(పద్మక్రాంతి ప్రతినిధి):



రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి పూర్తి కానీ పనులను వేగవంతగా పూర్తి చేయాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌హా శశాంక (ఐఏఎస్) సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ పై ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక ఐఏఎస్, రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, ప్రిన్సిపల్ పౌర సరఫరాల శాఖ సెక్రటరీ, కమిషనర్ డి.ఎస్.చౌ-హాన్ లతో కలిసి అన్ని విభాగాల హెచ్‌ఓడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వివిధ దేశాల నుంచి రాష్ట్రాల నుండి వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నీ రకాల సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా తమకు కేటాయించిన పనులను ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, ఇంటర్నెట్ సౌకర్యంలోఅంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. రవాణా సౌకర్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, హెలిప్యాడ్లు, పార్కింగ్ స్థలాల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. మెడికల్ సిబ్బందితో అవ-సరమైన వద్ద శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ కు వివిధ ప్రాంతాల నుండి దేశాల నుండి డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుంచి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతంలో పారిశుద్ధ్యం చేపట్టాలని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, రోడ్లపై ఎక్కడ ఎలాంటి చెత్త లేకుండా చూడాలని సూచించారు. మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారులు ఎలాంటి సంఘటనలు జరగకుండ చర్యలు చేపట్టాలన్నారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులని బాధ్యతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రోటోకాల్ సెక్రటరీ నర్సింహారెడ్డి, అధికారులు ప్రేమ్ రాజ్,హా హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా బోర్డు ఎండి కె.అశోక్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, ఆర్ అండ్ బి, ఫైర్ సేఫ్టీ, ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, టిజిఎస్పీడిసిఎల్, టూరిజం, ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి...

- హడ్కో చైర్మన్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై చర్చ

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి):



తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హడ్కో ఛైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సీఎం హడ్కో ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బు÷-లలెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి... హడ్కో ఛైర్మన్‌ల మధ్య చర్చ సాగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్షన్) అంశాన్ని సీఎం హడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సీఎం కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో ఛైర్మన్ సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని సీఎం కోరగా ఛైర్మన్ కులశ్రేష్ఠ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న భారత్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హడ్కో ఛైర్మన్‌ను సీఎం ఆహ్వానించారు. మావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కే.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, హడ్కో రీజినల్ చీఫ్ పి.సుభాష్ రెడ్డి, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్లు ఆశీష్ గుండాల, సయ్యద్ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ డీఎస్పీ అధికారి ముసుగులో వసూళ్లు

- ఎపికి చెందిన శ్రీను తదితరుల ముఠా అరెస్ట్

వరంగల్,డిసెంబర్1(పద్మక్రాంతి):



ఏసీబీ డీఎస్పీ అధికారి ముసుగులో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఘరానా ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిని వరంగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టయిన నిందితుల నుంచి పోలీసులు ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి మంగళ శ్రీను అలియాస్ వాసు(45)ని సత్యసాయి పుట్టపర్తి జిల్లా వేలమద్ది గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. మిగతావారు కర్ణాటకకు చెందినవారిగా గుర్తించారు. ప్రస్తుతం సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మీడియాకు వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి శ్రీనివాస్.. ప్రభుత్వ శాఖల్లోని ఉన్నత పదవుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులతో పాటు పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని వారికి ఏసీబీ డీఎ-స్పీనంటూ ఫోన్ చేసేవాడు. మీ మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి, కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది అని బెదిరించి సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. ఇందులో భాగంగా నిందితుడు వరంగల్ జిల్లా రోడ్డు రవాణా శాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మల జైపాల్ రెడ్డికి ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ బెదిరించి సుమారు రూ.9.96 లక్షలు వివిధ మార్గాల్లో దోచుకున్నాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే 2002లో ద్విచక్ర వాహనం చోరీతో దొంగతనాలు మొదలుపెట్టిన శ్రీనివాస్.. ఆ తర్వాత నకిలీ పోలీస్ అధికారిగా అవతారమెత్తి రాయలసీమ ప్రాంతంలో జరిగిన పలు చోరీ కేసుల్లో అరెస్టు అయిన నిందితుల కుటుంబ సభ్యుల్ని టార్గెట్‌గా చేసుకొని వారిని బెదిరించి బంగారం, డబ్బు దోపిడికి పాల్పడ్డాడు. సుమారు 50 కేసుల్లో నిందితుడిగా ఉండటంతో పోలీసులు అతడిని గుర్తించి అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయినా తన వ్యవహార శైలిని మార్చుకోని శ్రీనివాస్.. జైలు నుంచి విడుదలయ్యాక కర్ణాటకలోని బెంగుళూరు, ఏపీలోని రాయలసీమ ప్రాంతాల్లో 41కి పైగా చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టయి మరోసారి జైలుకెళ్లాడు. మళ్లీ విడుదలై సులభంగా డబ్బును సంపాదించాలనే లక్ష్యంతో నకిలీ ఏసీబీ డీఎస్పీగా అవతారమెత్తి ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్ ద్వారా బెదిరించి సుమారు రూ.50 లక్షలకు పైగా దోపిడీ చేశాడు.

## హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ

- గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయూకు సిద్ధం

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి):



తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్ కోసం ఏర్పాట్లు ఘనంగా జరుగు తున్నాయి. ఈ నెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా వివిధ రంగాలకు చెందిన మూడు వేల మంది ప్రతినిధులకు ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రత్యేక వేదికను ఫ్యూచర్ సిటీలో రూపొందిస్తున్నారు. సమ్మిట్‌లో భాగంగా మూడు వేల డ్రోన్లతో షోను ఏర్పాటు చేస్తున్నారు హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ రూపొందించనున్నారు. ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అజయ్ దేవ్‌గన్ ఎంఓయూ కుదుర్చుకో నున్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ గ్రూప్ ముందుకు వచ్చింది. వెంటారా కన్జర్వేటరీ నిర్మించేందుకు రిలయన్స్ ఆసక్తిగా ఉంది. వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ, నైట్ సఫారీ ప్రాజెక్ట్ పర్యాటక రంగానికి భారీ ప్రోత్సాహకం అందించనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ స్పందన లభిస్తోంది. సమ్మిట్‌లో కీలక ఒప్పందాల చేసుకునేందుకు పలువురు పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు. ఫుడ్‌లింక్ భారీ ఇన్వెస్ట్‌మెంట్ చేయబోతోంది. రూ. 3,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఫ్యూచర్ సిటీలో మూడు లగ్జరీ హోటల్స్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించనుంది.

## పది ఉత్తమ పోలీస్ స్టేషన్లలో శామీర్ పేట

- కేంద్ర హోంశాఖ ఎంపికలో స్టేషన్‌కు చోటు

హైదరాబాద్,డిసెంబర్1(పద్మక్రాంతి):

తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపును చాటింది. కేంద్ర హోంశాఖ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లలో.. సైబరాబాద్ కమిషనరేట్‌కు పరిధిలోని శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏడో స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించింది. దీంతో శామీర్‌పేట స్టేషన్ అధికారులకు అభినందనలు వెల్లువెత్తాయి.

పోలీస్ ఉన్నతాధికారులు స్టేషన్ అధికారులను అభినందించారు. ఢిల్లీలోని ఘాజీపుర్ ల్యాండ్‌ఫిల్ పోలీస్‌స్టేషన్ తొలిస్థానంలో ఉంది. ఏటా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న, వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తున్న పది ఉత్తమ పోలీస్ స్టేషన్లను హోంశాఖ ఎంపిక చేస్తుంటుంది. ఈ ఎంపిక ప్రక్రియలో స్టేషన్ పనితీరు, పరిపాలనా సామర్థ్యం, ఫిర్యాదుదారులతో, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదుల పరిష్కారం, పోలీస్ స్టేషన్ రికార్డులు, డాక్యుమెంటేషన్ నిర్వహణను పరిశీలిస్తారు. ఈ అన్ని ప్రమాణాలలో శామీర్‌పేట్ స్టేషన్ ప్రతిభ కనబర్చడం ద్వారా దేశంలో ఏడో అత్యుత్తమ స్టేషన్‌గా, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సాధించిన ఈ ఘనత పట్ల ఆ స్టేషన్ సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏడీసీపీ పురుషోత్తం, ఏసీపీ మేడ్చల్ బాలగంగిరెడ్డితో పాటు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్.. మొత్తం సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసే ఈ ప్రక్రియలో, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన శామీర్పేట్ పోలీస్ స్టేషన్ రాష్ట్రంలో అగ్రస్థానాన్ని, దేశంలో ప్రతిష్టాత్మకమైన ఏడో ర్యాంకును సాధించడం విశేషం.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# టామ్‌కామ్ ద్వారా నైపుణ్య శిక్షణ ఆర్నెల్లలో 2,192 మందికి ఉద్యోగాలు..




(హైదరాబాద్)

విదేశీ కొలువు సాధించాలంటే చదువు ఒక్కటే సరిపోదు..అక్కడి భాషపై పట్టు ఉండాలి. ఆ భాష నేర్చుకోవాలంటే రూ.వేలల్లో వెచ్చించాలి. ఈ నేపథ్యంలో ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2015లో టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్) సంస్థను ఏర్పాటు చేసింది. ఏజెంట్లు, మధ్యవర్తుల వల్ల దరఖాస్తుదారులు మోసపోకుండా ఈ సంస్థ పనిచేస్తుంది. నగరంలోని పదుల సంఖ్యలో యువత ఇప్పటికే దరఖాస్తు చేసుకొని శిక్షణ తీసుకుంటున్నారు.

**రిజిస్ట్రేషన్ చేసుకుంటే..** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఫార్మా, ప్లంబింగ్, నర్సింగ్, బిల్డింగ్ వర్క్ తదితర విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారిని టామ్‌కామ్ ఎంపిక చేస్తుంది. ఇతర దేశాల్లోని ఖాళీల ఆధారంగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.inలో వివరాలు నమోదు చేసుకున్న వారిని అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇటీవల జపాన్, గ్రీస్, జర్మనీ, ఇజ్రాయెల్ తదితర దేశాల్లో ఉద్యోగ ఖాళీల కోసం టామ్‌కామ్ దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది జూన్ వరకు 2,192 మంది వివిధ దేశాల్లో ఉద్యోగాలు పొందారు. జర్మనీ, జపాన్ దేశాలకు ఎంపికైన వారికి ఆయా దేశాల భాషలను నేర్పిస్తారు.

**ఏఏ దేశాలకు వెళుతున్నారంటే..** కువైట్, జపాన్, జర్మనీ, ఖతార్, గ్రీస్, ఇజ్రాయెల, సౌదీ వంటి దేశాలకు ప్రస్తుతం నైపుణ్యం ఉన్న వారిని టామ్‌కామ్ పంపుతోంది. ఆయా దేశాల సంస్థలు ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్‌ను సంప్రదిస్తున్నాయి.

# ఉచిత వైఫై వాడుతున్నారా?



(హైదరాబాద్)

నేటి డిజిటల్ యుగంలో అంతర్జాలం రోజువారీ అవసరంగా మారింది. వివిధ అవసరాల నిమిత్తం చాలామంది ఫ్రీ వైఫై వినియోగిస్తుంటారు. బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు.. ఇలా పబ్లిక్ ప్లేస్‌లో ఫ్రీ వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పబ్లిక్ వై-ఫై వాడే సమయంలో డేటా చోరీ, ఆర్థిక మోసం జరిగే ప్రమాదం ఉందని భారత ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ హెచ్చరించింది.


**నష్టాలు ఇవే..**

భద్రతా లోపం..: పబ్లిక్ వైఫైలో తగినంత భద్రత ఉండదు. హ్యాకర్లు మనల్ని మోసం చేయడానికి నకిలీ వైఫై నెట్‌వర్క్‌లను రూపొందిస్తుంటారు.

డేటా చోరీ..: పబ్లిక్ వైఫైకి కనెక్ట్ అయిన వెంటనే హ్యాకర్లు మీ ఫోన్ పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఈ-మెయిల్స్ వంటి వాటిని సులభంగా అపహరించే ప్రమాదం ఎక్కువ.మీ ఫోన్‌లోకి వైరస్‌లను పంపి, సమాచారం సేకరించడం హ్యాకర్లకు చాలా సులభం.

అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే..: వీలైనంత వరకు పబ్లిక్ వైఫైని వాడకపోవడం ఉత్తమం. అత్యవసర పరిస్థితుల్లో వీపీఎన్ వాడటం ఉత్తమం. తద్వారా కొంత వరకు భద్రత లభిస్తుంది.

# దరఖాస్తులో ఈ తప్పులు అసలు చేయొద్దు.. గడులు ఖాళీగా వదిలితే ఏం అవుతుంది..?



(హైదరాబాద్)

రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల వేడి పెరిగిపోయింది. రాజకీయ పార్టీలు ఈ స్థానిక ఎన్నికలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. బలమైన అభ్యర్థులను నిలబెట్టే యోచనలో పార్టీలు ఉన్నాయి. ఇవాల్టి నుంచి స్థానిక ఎన్నికలకు నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించి ఇద్దరు సాక్షులు ధ్రువీకరించిన స్వీయ ప్రకటనను నామపత్రంతో పాటు దాఖలు చేయాలని ఎన్నికల నియమావళి చెబుతోంది. మరి ఆ నామపత్రం ఎలా నింపాలి, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు ఎవరు? అనే వివరాలు తెలుసుకుందాం.

**కుటుంబ సభ్యుల వివరాలు నమోదు :**

అభ్యర్థి తనతో పాటు కుటుంబ సభ్యులైన భార్య/భర్త, కుమార్తె, కుమారుడికి సంబంధించిన వివరాలను అఫిడవిట్?లో పొందుపర్చాలి.

కుమార్తెకు వివాహం అయితే ఆమె వివరాలు ప్రస్తావించాల్సిన అవసరమే లేదు.

కుమారుడికి పెళ్లైతే కోడలికి సంబంధించిన వివరాలు వెల్లడించాలి.

కుమారుడు-కోడలు వేరుగా నివసిస్తుంటే వారి వివరాలు ప్రస్తావించాల్సిన అవసరం లేదు.

నామినేషన్? ఫారం ఫిల్? చేసినప్పుడు గడులు ఖాళీగా వదలరాదు.

అందులో తనకు వర్తించదని లేదా నదారత్? అని రాయాలి.

లేకుంటే నామపత్రం తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది.

స్వీయ ధ్రువీకరణ తప్పుగా ఇచ్చినట్లు రుజువైతే క్రిమినల్? కేసు నమోదవుతుందని ఎన్నికల నియమావళి స్పష్టం చేస్తోంది.

**ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులెవరు :**

సర్పంచి పదవికి పోటీ చేసే వ్యక్తి సదరు గ్రామ పంచాయతీ పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి.

వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి పంచాయతీ పరిధిలో ఎక్కడైనా ఓటరుగా నమోదు కావడంతో పాటు బరిలో నిలిచే వార్డు పరిధిలోని ఒక ఓటరు కచ్చితంగా ప్రతిపాదించాలి.

సర్పంచి, వార్డు సభ్యులుగా పోటీ చేసే వ్యక్తుల వయసు 21 ఏళ్లు నిండాలి.

రేషన్? డీలర్లు, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులు, సహకార సంఘాల సభ్యులు పోటీ చేయొచ్చు.

ఒక వ్యక్తి ఒక పదవికి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామపత్రాలు సమర్పించవచ్చు.

నామపత్రం దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు ముగ్గురిని మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతిస్తారు.

అభ్యర్థి తరఫున ప్రతిపాదకులు సైతం నామపత్రం దాఖలు చేయొచ్చు.

**అనర్హులు ఎవరు :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.

తమ ఉద్యోగానికి రాజీనామా చేసి ఆమోదం పొందిన తర్వాత పోటీ చేయొచ్చు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పోటీకి అనర్హులు.

మతి స్థిమితంలేని వ్యక్తులు అనర్హులు.

ప్రతిపాదకుడి సంతకం ఫోర్జరీ చేసినట్లు ఆర్ఓ నిర్ధారిస్తే నామపత్రం తిరస్కరణకు గురవుతుంది.

క్రిమినల్ కోర్టు ద్వారా దోషులుగా తేలితే ఆరోజు నుంచి ఐదేళ్ల వరకు పోటీకి వారు అనర్హులు.

ఆరు నెలలు జైలు శిక్ష పడిన వ్యక్తులు ఆరోజు నుంచే పోటీకి అనర్హులు.

జైలు నుంచి విడుదలైన తర్వాత ఆరేళ్ల వరకు పోటీకి అనర్హులు.

గతంలో స్థానిక సంస్థల్లో పోటీ చేసి ఎన్నికల వ్యయం వివరాలు సమర్పించనివారు మళ్లీ పోటీ చేయడానికి అనర్హులు.

దివాలాదారుగా(ఐపీ) న్యాయ నిర్ణయం కోసం దరఖాస్తు చేసిన వ్యక్తి, రుణ విమోచన పొందని దివాలాదారు పోటీకి అనర్హులు.

ప్రభుత్వం గుర్తించిన గుత్తేదారు పోటీ చేయరాదని ఎన్నికల నిబంధనావళి చెబుతోంది.

# చిన్న నగరాల్లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

## టైర్2లో 4 శాతం పతనం : ప్రాప్ ఈక్విటీ రిపోర్ట్





(న్యూఢిల్లీ)

భారత ఆర్థిక వ్యవస్థ సన్నగిల్లుతోంది. నివాసాల కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా దేశంలోని టాప్ 15 ద్వితీయ శ్రేణీ నగరాల్లో అమ్మకాలు క్షీణించాయి. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 4 శాతం విక్రయాలు తగ్గాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలోని 39,201 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే ఈ ఏడాది క్యూ3లో 4 శాతం తగ్గుదలో 37,409 యూనిట్లకు పడిపోయాయి. నూతన గృహాల అమ్మకాలు ఏకంగా 10 శాతం క్షీణించి 28,721 యూనిట్లకు పరిమితమయ్యాయి. యూనిట్ల అమ్మకాల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రీమియం గృహాల అమ్మకాల్లో మాత్రం పెరుగుదల చోటు చేసుకుంది. 15 ప్రధాన నగరాలలో 8 నగరాల్లో అమ్మకాలు తగ్గాయి.

భువనేశ్వర్‌లో అత్యధికంగా 26 శాతం క్షీణత నమోదయ్యింది. అహ్మదాబాద్, సూరత్, వడోదర, నాసిక్, నాగ్‌పూర్, కోయంబత్తూరులో అమ్మకాలు 6 శాతం మేర తగ్గాయి. తిరువనంతపురంలో మాత్రం 19 శాతం అమ్మకాలు పెరగడం విశేషం. గాంధీనగర్, జైపూర్, మొహాలీ, లక్నో, భోపాల్, గోవాలలో వృద్ధి చోటు చేసుకుంది. "ముడి పదార్థాల ధరలు పెరగడం, ఇళ్ల ధరలు, పరిమాణాలు పెరగడంతో సరసమైన, మధ్య ఆదాయ గృహాల అమ్మకాల వేగం నెమ్మదించింది," అని ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకులు, సిఇఒ సమీర్ జసుజా పేర్కొన్నారు.

# విద్యార్థులకు గుడ్ న్యూస్.. నెక్ట్స్ ఇయర్ నుంచి సిలబస్‌లో ఏఐ క్లాసెస్




(హైదరాబాద్)

ప్రపంచమంతా సాంకేతికత వైపు అడుగులు వేస్తున్న వేళ తెలంగాణ, ప్రభుత్వ పాఠశాలలో చదివే వారి కోసం కొత్త ఆలోచనలు చేస్తుంది. చిన్నతనం నుంచే వారిలో కృతిమ మేధస్సు పై మంచి పట్టును పెంచాలనే ఉద్దేశాన్ని కలిగి ఉంది. రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సర్కారు ఇప్పటికే సాంకేతికతను వినియోగిస్తుంది. దానితో పాటు అనుభవంతో కూడిన విద్యను అందించటానికి రంగాన్ని తయారు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరానికి 2026-2027 మూడో తరగతి నుంచే సిలబస్‌లో ఏఐ పాఠాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అయితే రాష్ట్రం ఈ ఏడాది విద్య సంవత్సరంలోనే తేవటం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే విద్యాశాఖ ఉండటం వల్ల చాలా వేగంగా పనులు అమల్లోకి వస్తున్నాయి.

తెలంగాణలోని 347 మండలాల్లో 1,354 స్కూళ్లల్లో ఏఎక్స్‌ఎల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

ఈ ఏడాది నుంచే వారి వారి తరగతుల్లో వెనకపడిన విద్యార్థులు ఏఐ ఆధారిత సాంకేతికతతో ఆంగ్లం, గణితం పాఠ్యాంశాలను నేర్చుకునేలా ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారం అందిస్తోందన్నారు.

"ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్" పేరుతో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం పుస్తకాలను ముద్రించారు. ఆ పై పంపిణీ చేశారు. దీంతో ఏఐ, కోడింగ్, డేటా సైన్స్, డిజైన్ థింకింగ్, డిజిటల్ సిటిజన్‌షిప్ తదితర వాటిపై అవగాహన పెరుగుతుంది.

వీటిని బోధించేందుకు 29,330 మంది టీచర్లకు పెద్ద ఎత్తున చొరవచూపిస్తూ శిక్షణ ఇస్తున్నారు.

సుమారు 17,875 తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళు (ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేశారు. వీటితో గ్రీన్‌బోర్డుగా, అవసరమైనప్పుడు డిజిటల్ పాఠాల కోసం టీవీలా వాడుకోవచ్చు. అంతేకాకుండా దాదాపు 6,324 బడులల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

టీజీలోని 642 పాఠశాలల్లో తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్‌ఎల్) ద్వారా టింకరింగ్ కిట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటి వల్ల వివిధ ప్రాజెక్టులు చేసుకునే అవకాశం కలుగుతుంది.

తెలంగాణ ఎచీవర్స్ ప్రోగ్రామ్ పేరుతో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, జనరల్ రెసిడెన్షియల్ కళాశాలల్లోని ఇంటర్ విద్యార్థులకు జేఈఈ,నీట్, ఎప్‌సెట్, క్లాట్ పరీక్షలకు ప్రిపేర్? చేయటానికి ఫిజిక్స్ వాలా సంస్థ సహకారంతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 2 లక్షల మంది వాటిని వినియోగిస్తున్నారు.

సైన్స్, మ్యాథ్స్? సబ్జెక్టులకు సంబంధించి ఖాన్? అకాడమీ సహకారం తీసుకున్నారు. ఈ అకాడమీతో కలిసి 5,066 ప్రభుత్వ ఆన్?లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పాత ప్రాథమిక తరగతులను అందుబాటులోకి తీసుకురావడం, కొత్తగా ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం లాంటి ఎన్నో చర్యలను విద్యాశాఖ చేపట్టింది.

మధ్య- ఉన్నత తరగతులైన 6 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం సమస్యలను అర్థం చేసుకోవటం, వాటికి సమాధానాలు వెతకటం, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా వారిని కృతిమ మేధ పై అవగాహన కల్గించనున్నారు.

ప్రభుత్వం తీసుకునే ఈ విధమైన నిర్ణయం వల్ల స్టూడెంట్స్ భవిష్యత్తులో రాబోయే అవకాశాలకు సిద్ధంగా ఉండటానికి దోహదపడుతుంది.

దీంతో ముందు ముందు ప్రపంచంలో భారతదేశం ఏఐ కేంద్రంగా మారనుంది.

# రేషన్ షాపుల్లో జరిగే ఈ మోసం గురించి మీరు తెలుసుకోండి..



(హైదరాబాద్)

పేదల నోటికి ముద్ద అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై బియ్యాన్ని చౌక ధరల దుకాణాలు(రేషన్ షాప్‌లు) ద్వారా అందిస్తున్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల కొంతమంది రేషన్ డీలర్లు బియ్యం తూకంలో మోసాలకు పాల్పడుతూ ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్నారు. కొన్నేళ్లుగా డీలర్ల మోసాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మోసంపై ప్రశ్నిస్తే ఉచితంగా వచ్చే బియ్యానికి గొడవెందుకు చేస్తున్నారని, మండల స్థాయి బియ్యం నిల్వల కేంద్రం నుంచి తూకం వేయకుండా తక్కువ ఇస్తుండటం వల్ల తామే నష్టపోతున్నామంటూ తిరిగి బుకాయిస్తున్నట్లుగా సమాచారం.

బియ్యం తూకంలో మోసాలిలా : గోనె సంచుల మోసంతో పాటు తెలివిగా తూకం యంత్రాల్లో అత్యాధునిక చిప్‌లను అమర్చి వాటిని రిమోట్ ద్వారా కంట్రోల్ చేస్తూ బరువు ఎక్కువ చేసి చూపిస్తూ కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. కిలో నుంచి రెండు కిలోల వరకు బియ్యం తక్కువ తూకం వేస్తున్నట్లుగా లబ్ధిదారులు వాపోతున్నారు. తూనికలు కొలతల శాఖాధికారులు(లీగల్ మెట్రాలజీ) ప్రతి రేషన్ దుకాణాన్ని సందర్శించి యంత్రాన్ని పరిశీలించాల్సి ఉ ండగా పట్టించుకునే నాథుడే లేరు. డీలర్లు అడ్డూఅదుపు లేకుండా సాంకేతికతను ఉపయోగించి కొత్తతరహా మోసాలకు తెరదీస్తూ ఇష్టారాజ్యంగా సొమ్ముచేసుకుంటున్నారు.

గోనె సంచితో తూకంతో భారం : తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నప్పటి నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వరుస కడుతున్నారు. లబ్ధిదారుడు తీసుకొచ్చిన ప్లాస్టిక్ సంచితో తూకం వేయాల్సి ఉండగా, కొంతమంది ప్రభుత్వం నుంచి బియ్యం సరఫరాకు ఉపయోగించిన జనపనార(గోనె) సంచితో తూకం వేస్తున్నారు. ఈ సంచి సుమారు 550 గ్రాముల వరకు ఉంటుంది. ఇలా ప్రతి కుటుంబానికి సరఫరా చేసిన బియ్యంలో ఒక అర కిలో తక్కువగా వెళ్తుంది. ఈ లెక్కన ఎన్నో వేల కేజీల బియ్యం పక్కదారిపడుతున్నట్లుగా తెలుస్తోంది.

తిరిగి డీలర్‌కే విక్రయం : ఇటీవల మంజూరైన రేషన్ కార్డుల్లో కొంతమంది ఆర్థికంగా స్థిరపడ్డవారూ ఉన్నారు. వీరు రేషన్ ద్వారా వచ్చే బియ్యాన్ని తీసుకొని తినకుండా అదే పౌరసరఫరాల దుకాణంలో డీలర్‌కు అమ్ముతున్నారు. కొంతమంది మధ్య తరగతి కుటుంబాలు కూడా ఇలాగే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే ఆసరాగా తీసుకున్న డీలర్లు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ బ్లాక్ మార్కెట్?కు తరలిస్తున్నారు.

వారికి తూకమే వేయరట : రేషన్ డీలర్లకు కేటాయించిన బియ్యం బస్తాలను తూకం వేయాల్సి ఉంటుంది. అయితే సరఫరాలో ఆలస్యం అవుతుందనే కారణంతో కొన్నిసార్లు తూకం వేయకుండానే లారీల్లో నింపుతున్నారు. బస్తాలను తూకం వేస్తే వ్యత్యాసం వచ్చే అవకాశం లేదు. తమ కోటా ఆధారంగా బియ్యం తరలిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. దొడ్డు బియ్యం సంచులు నెలల తరబడి నిల్వ ఉండటంతో వ్యత్యాసం వచ్చేవి. అయితే సన్నబియ్యం ఇటీవల మరపట్టినవే కావడంతో వ్యత్యాసం వచ్చే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా రోహిత్ శర్మ

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా నిలిచాడు. రాంచిలో దక్షిణాఫ్రికా, టీమ్ఇండియా మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ దీనికి వేదికైంది. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో (14.1; 14.2) రోహిత్ రెండు వరుస సిక్స్‌లు బాదాడు. ఈ మ్యాచ్ ముందు వరకు రోహిత్ శర్మ ఖాతాలో వన్డేల్లో 349 సిక్స్‌లున్నాయి. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో వచ్చిన రెండు వరుస సిక్స్‌లతో రోహిత్ శర్మ.. పాకిస్థాన్ బ్యాటర్ షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న అత్యధిక సిక్స్‌ల (351) రికార్డ్‌ను సమం చేశాడు. అనంతరం మార్కో యాన్సన్ బౌలింగ్‌లో (19.4) బౌలింగ్‌లో అతడు అద్భుతమైన సిక్స్ బాదాడు. దీంతో హిట్‌మ్యాన్ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల (352) వీరుడిగా నిలిచాడు. షహిద్‌అఫ్రిదీ, క్రిస్‌గేల్, సనత్ జయసూర్య, ఎంఎస్ ధోనీ వంటి హేమా హేమీలను వెనక్కి నెట్టి ఈ జాబితాలోఅగ్రస్థానానికి చేరాడు.

**ఆ షాట్ రోహిత్ వజ్రాయుధం..!**

సచిన్ ఆన్ డ్రైవ్, విరాట్ ఎక్స్‌ట్రాకవర్ డ్రైవ్, లక్ష్మణ్ ఫ్లిక్, ధోని హెలికాప్టర్ షాట్లను చాలా కళాత్మకంగా ఆడగలరు. కానీ, రోహిత్ అమ్ములో




పొదిలో ఓ పవర్ ప్యాక్డ్ షాట్ ఉంది. అదే అతడిని హిట్‌మ్యాన్ చేసింది. అతడి షాట్లలో వజ్రాయుధం లాంటిది. మిగిలిన బ్యాటర్లను ప్రత్యర్థి బౌలర్లు బౌన్సర్లు, షార్ట్‌పిచ్ బాల్స్‌తో భయపెడతారు కానీ.. రోహిత్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఆ బంతులు వేయడానికి యత్నించరు. ఎందుకంటే అతడు తన ఫేవరెట్ షాట్‌ను ప్రయోగిస్తే.. బౌలర్ల గణాంకాలు గల్లంతు కావాల్సిందే. రోహిత్ అమ్ములపొదిలోని ఆ శక్తిమంతమైన ఆయుధం పేరు పుల్ షాట్. సమకాలీన వన్డే క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరూ ఈ ఒక్కషాట్‌తో బాదనన్ని సిక్సర్లను రోహిత్ కొట్టాడు. ఈఎస్పీన్ గణాంకాల ప్రకారం 20152020 మార్చి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 570 పుల్ షాట్లు వాడి రోహిత్ 116 సిక్సర్లను మలిచాడు..! ఆ తర్వాత స్థానంలో ఉన్న ఇయాన్ మోర్గాన్ 294 పుల్ షాట్లు ఆడి కేవలం 47 మాత్రమే సిక్సర్లు మార్చగలిగాడంటే రోహిత్ ఏ స్థాయిలో ఈ షాట్‌ను ఆడాడో అర్థం చేసుకోవచ్చు. క్రికెట్ డాట్‌కామ్ ప్రకారం 2010 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఈ షాట్‌తో వన్డేల్లో రోహిత్ కొట్టిన సిక్సర్ల సంఖ్య 127. ఒక్క వన్డేల్లోనే రోహిత్ చేసిన పరుగుల్లో దాదాపు 19 శాతానికిపై దీని నుంచి రాబట్టినవే.

**కలిసొచ్చిన అద్భుతమైన టైమింగ్..**

రోహిత్ ప్రతిస్పందన వేగం మిగిలిన బ్యాటర్లతో పోలిస్తే చాలా వేగంగా ఉంటుంది. దీంతో అతడికి 'ఎక్స్‌ట్రా సెకండ్' ఉంటుందని కామెంటేటర్లు తరచూ చెబుతుంటారు. దీంతో అతడు బంతిని డీప్‌స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీని దాటించేస్తాడు. కింగ్ కోహ్లీ సైతం ఈ షాట్ ఆడటానికి కొంత అసౌకర్యంగా ఫీలవుతాడు.. అలాంటిది రోహిత్ మాత్రం అలవోకగా ఆడేస్తాడు.







## రాణించిన రో-కో..
## దక్షిణాఫ్రికా విజయలక్ష్యం 350

రాంచి వేదికగా టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా జట్లు మొదటి వన్డేలో తలపడుతున్నాయి. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ (135; 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) అద్భుతమైన సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (57, 51 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (60; 56 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. కోహ్లీకి వన్డే కెరీర్‌లో ఇది 52వ సెంచరీ. అలాగే అతడు దాదాపు రెండేళ్ల తర్వాత చేసిన సెంచరీ ఇది. విరాట్ ఇంతకు ముందు చివరిసారిగా 15 నవంబర్ 2023లో వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద 117 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13), అర్షదీప్ సింగ్ (0) విఫలమయ్యారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోకి వచ్చీరాగానే ఫోర్‌తో ఖాతా తెరిచాడు. క్రీజులో ఉన్నంత సేపు మంచి రిథమ్‌లోనే కనిపించాడు. కానీ దూకుడుగా ఆడే ప్రయత్నంలో జైస్వాల్ (18) నాండ్రే బర్గర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రవీంద్ర జడేజా (32) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఓట్నీల్ బార్ట్‌మన్, నాండ్రే బర్గర్, మార్కో యాన్సెన్, కోర్బిన్ బాష్‌ తలో రెండు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు.

## అహ్మదాబాద్ కామన్వెల్త్ క్రీడలు..
## నిర్వహణ ఖర్చుల అంచనా ఎంతంటే!




గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు నిర్వహించనున్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ సర్వసభ్య సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రీడల నిర్వహణ కోసం త్వరలో ఓ ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రూ.3,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వ్యయంతో ఈ గేమ్స్‌ను నిర్వహించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మొత్తం ఖర్చు ఖరారు విషయంలో ఇంకా అంచనాలు రూపొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గతంలో 2010లో దిల్లీ కామన్వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఇది అనేక వివాదాల్లో చిక్కుకుంది. మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం, అవినీతి ఆరోపణలు, ప్రాథమిక అంచనాల కన్నా చాలా ఎక్కువ ఖర్చు కావడం వంటివి జరిగాయి. ఈ క్రీడల నిర్వహణకు రూ.635 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ.. చివరకు రూ.2,600 కోట్లు దాటింది. మౌలిక సదుపాయాలు సహా అన్ని లెక్కలోకి తీసుకుంటే చాలా పెద్ద మొత్తమని తెలిసింది. ఈ అనుభవాల నుంచి గుజరాత్ అవసరమైన పాఠాలు నేర్చుకోనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. డిసెంబర్ లేదా, వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. దీన్ని లాభాపేక్ష లేని సంస్థగా నమోదు చేయనున్నారు. 2006 మెల్‌బోర్న్ కామన్వెల్త్ క్రీడల్లో ఇదే నమూనాను విజయవంతంగా ఉపయోగించారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సీఈవో, కామన్వెల్త్ స్పోర్ట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులు, నిపుణులు, అథ్లెట్లు కలిపి 1215 మంది సభ్యులుగా ఉండే అవకాశం ఉంది. 15 17 క్రీడాంశాల్లో 2030 అక్టోబరులో ఈ గేమ్స్ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.




## సిమ్ లేకుండా
## వాట్సప్, టెలిగ్రామ్‌లు పని చేయవు

* 90 రోజుల్లో నిబంధన అమల్లోకి..

సిమ్ లేకపోయినా వాట్సప్, టెలిగ్రామ్ వాడేవాళ్లు చాలా మంది ఉంటారు. వారందరికీ కేంద్రం షాక్ ఇచ్చింది. కమ్యూనికేషన్ యాప్స్ (వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటివి) లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఈ నిబంధనలు 90 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. యాప్‌ను వెబ్ బ్రౌజర్‌లో ఉపయోగిస్తే, ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే



సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సూక్ష్మ రుణాలు తగ్గుముఖం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సూక్ష్మ రుణాల జారీ మందగిస్తోంది. కొత్త రుణాల మంజూరు తక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి 36 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 718 జిల్లాల్లో బ్యాంకులు, మైక్రోఫైనాన్స్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) జారీ చేసిన సూక్ష్మ రుణాల మొత్తం రూ.3,39,510 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదేకాలం నాటికి ఈ మొత్తం రూ.4,08,049 కోట్లు ఉండటం గమనార్హం. దీంతో పోల్చితే సూక్ష్మరుణాల మొత్తం 16.8 శాతం తగ్గినట్లు తెలుస్తోంది.బిహార్‌లో అధికంగా...: సూక్ష్మ రుణాల మార్కెట్లో మైక్రోఫైనాన్స్ (ఎన్‌బీఎఫ్‌సీ ఎంఎఫ్ఐ) సంస్థలు 39.2 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. బ్యాంకుల వాటా 31.4 శాతం కాగా, ఎన్‌బీఎఫ్‌సీలకు మిగిలిన వాటా ఉంది. రుణాల జారీలో బిహార్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. తదుపరి స్థానాల్లో తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. సూక్ష్మరుణాల మొత్తం వరుసగా ఆరో త్రైమాసికంలోనూ తగ్గుముఖం పట్టటం గమనార్హం.

## చాట్‌జీపీటీ @3..
## సెర్చ్ గతిని మార్చిన ఏఐ చాట్‌బాట్

2022 నవంబర్ 30.. చాట్‌జీపీటీ అనే ఒక ఏఐచాట్‌బాట్ పుట్టుకొచ్చింది. చూడ్డానికి వాట్సప్ తరహాలో ఓ విండో.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంటే ఏదో బాట్ అనుకున్నారంతా. కానీ ఆ ఒక్క అడుగు ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేసే తొలి అడుగు అని ఎవరూ ఊహించలేదు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఆ ఏఐ చాట్‌బాట్ తీసుకొచ్చిన మార్పేమిటో ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. ఒకప్పుడు ఏదైనా సందేహం వస్తే గూగుల్‌ను అడిగేవారు. దానికి వందల లింకులు వచ్చేవి. వాటిలో ఏది క్లిక్ చేయాలో తెలిసేది కాదు. అదే సందేహాన్ని చూసి తెలుసుకోవాలంటే యూట్యూబ్‌లో వందలాది వీడియోలు ప్రత్యక్షమయ్యేవి. పదినిమిషాలు చూస్తే గానీ అది ఉపయోగకరమో కాదో అర్థంకాని పరిస్థితి. స్పష్టంగా చెప్తేగానీ అర్థం చేసుకోలేని అలెక్సా వంటి వాయిస్ అసిస్టెంట్లు మరోవైపు. ఆ సమయంలో అడుగుపెట్టింది చాట్‌జీపీటీ. సెర్చ్




గతిని సమూలంగా మార్చేసింది. 'గూగ్లింగ్' అనేవారు కాస్త 'ఆస్క్ చాట్‌జీపీటీ' అనే స్థాయికి వచ్చారంటే ఇది చూపిన ప్రభావం అలాంటిది మరి!

**తొలి అడుగే గట్టిగా..**


శామ్ అల్టమన్‌కు చెందిన ఓపెన్‌ఏఐ విడుదల చేసిన ఈ చాట్‌జీపీటీ అనతికాలంలోనే కోట్లమందికి చేరువైంది. తొలి రెండు నెలల్లోనే 10 కోట్ల మంది యూజర్లను సొంతం చేసుకుంది. 2025 నాటికి 80 కోట్ల యూజర్లకు చేరువైంది. ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగించే యాప్‌ల జాబితాలో నిలిచింది. అమెరికాలో దీన్ని అత్యధికంగా వినియోగిస్తుండగా.. భారత్ రెండో అతిపెద్ద మార్కెట్. బ్రెజిల్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**గూగుల్ సైతం..**

ఆన్‌లైన్‌లో ఏదైనా వెతకాలంటే ఒకప్పుడు సెర్చ్ ఇంజిన్లే ఆధారం. చాట్‌జీపీటీ ప్రవేశం తర్వాత ప్రజల వెతికే తీరులోనే మార్పు వచ్చింది. ఎవరికైనా తమ వైఫై రౌటర్‌లో సమస్య వస్తే 'ఎలా రిపేర్ చేయాలి' అని గూగుల్‌లో వెతికేవారు. 'అప్పుల ఊబిలోంచి ఎలా బయటపడాలి' వంటి ప్రశ్నలను గూగుల్‌ను అడిగేవారు. ఇప్పుడు ఎలాంటి లింకులూ లేకుండా చాట్‌జీపీటీ అత్యంత వేగంగా సమాధానాలు ఇస్తోంది. దీంతో గూగుల్ వంటి సంస్థలు కూడా సంప్రదాయ సెర్చ్ంజిన్‌కు ఏఐ హంగులు జోడించాల్సి వచ్చింది. తన జెమినైని గూగుల్ సెర్చ్‌లో ఇంటిగ్రేట్ చేసింది. 'ఏఐ ఓవర్‌వ్యూ' పేరుతో సమాధానాలు ఇస్తోంది.

**ఇదీ చాట్‌జీపీటీ గాడి రూల్..**

చాట్‌జీపీటీ దెబ్బకి ఒక్క సెర్చ్ ఇంజిన్ మాత్రమే కాదు.. స్మార్ట్ స్పీకర్లకూ డిమాండ్ క్రమంగా తగ్గుతోంది. అలెక్సా, గూగుల్ హోమ్ వంటి వాయిస్ అసిస్టెంట్ల కొనుగోళ్లు తగ్గుతున్నట్లు ఓ నివేదిక తెలిపింది. చాట్‌జీపీటీ వంటి ఎన్నో చాట్‌బాట్‌లు వచ్చినా యూట్యూబ్ మాత్రం బలంగా నిలదొక్కుకుంది. అయితే, యూట్యూబ్ చూసే తీరుతెన్నులూ మారుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. తొలుత చాట్‌జీపీటీ వంటి ఏఐచాట్‌బాట్‌లను సమాచారం అడిగి.. అదెలా ఫిజికల్‌గా చేయాలో తెలుసుకునేందుకు మాత్రమే యూట్యూబ్‌కు వస్తున్నారట. చాట్‌జీపీటీ లాంచ్ అయిన వెంటనే నిపుణులు ఏఐ వల్ల లక్షలాది ఉద్యోగాలు పోతాయని అంచనా వేశారు. దీని ప్రభావం మొదలైంది. వెబ్ డెవలపర్లు, అనువాదకులు, అమెరికన్ కాలేజీ విద్యార్థుల కోసం ఎస్సేలు రాసే కెన్యా ఫ్రీలాన్సర్లు దీని కారణంగా దెబ్బతిన్నారు. కొలంబియాలో 85% న్యాయమూర్తులు ఉచిత చాట్‌జీపీటీ లేదా మైక్రోసాఫ్ట్ కోపైలట్ ఉపయోగించి కేసులు త్వరగా ముగిస్తున్నారట. మాలిలో ఒక ఏఐ ప్రాజెక్ట్ స్థానిక భాషల్లో పాఠ్యాంశలను అనువదించి చిన్న పిల్లలు త్వరగా నేర్చుకోవడానికి, స్కూలు డ్రాపౌట్లను తగ్గించడానికి సహాయపడుతోందని మరో నివేదిక పేర్కొంది. దక్షిణ కొరియాలో చాట్‌జీపీటీ ఆధారిత రోబోలు వచ్చాయి. ఇవి వృద్ధులకు సహచరులుగా ఉంటున్నాయి. వారితో సంభాషించడం, మందులు వేసుకోవాలని గుర్తు చేయడం వంటి పనులు చేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో కుటుంబ సభ్యులకు అలర్ట్ చేస్తున్నాయి. 2024లో 50పైగా దేశాలు ఎన్నికలకు వెళ్లాయి. భాషా అడ్డంకులు దాటి ఓటర్లను చేర్చడానికి చాట్‌జీపీటీ వంటి ఏఐ చాట్‌బాట్‌లు ప్రచార బృందాలు పెద్దఎత్తున వినియోగించాయి.



RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక


# సినిమా



## ఓటీటీలోకి ది గర్ల్‌ఫ్రెండ్

ఓవైపు స్టార్ హీరోలతో కలిసి పాన్ ఇండియాల్లో నటిస్తోన్న రష్మిక మందన్నా మరోవైపు లేడీ ఓరియంటెడ్ మూవీస్ తోనూ మెప్పిస్తోంది.తాజాగా నేషనల్ క్రష్ నటించిన మూవీ 'ది గర్ల్ ఫ్రెండ్'. అందాల రాక్షసి ఫేమ్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో దసరా ఫేమ్ దీక్షిత్ శెట్టి మరో కీలక పాత్ర పోషించాడు. నవంబర్ 7న థియేటర్లలో విడుదలైన ఈ లవ్ ఎంటర్‌టైనర్ సూపర్ హిట్ గా నిలిచింది. చాలా తక్కువ బడ్జెట్ తో రూపుదిద్దుకున్న ఈ సినిమా రూ. 25 కోట్లకు పైగానే కలెక్షన్లు సాధించింది. ఇక ఈ చిత్రంలో భూమా క్యారెక్టర్‌లో రష్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా ఇప్పుడీ 'ది గర్ల్‌ఫ్రెండ్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిసెంబర్ 5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నది.ఈమేరకు నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.



## కామెంట్స్ దుమారం

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'కాంతర' 'కాంతార చాప్టర్ 1'లు భారీ విజయాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 'కాంతర'లో తన అద్భుతమైన నటనకు గాను రిషబ్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నాడు. ఈ సినిమాల్లో పంజుర్లీ దేవతపై తెరకెక్కించిన కొన్ని సన్నివేశాలు హైలైట్ గా నిలిచాయి. తాజాగా గోవాలో జరిగిన ఇఫీ వేడుకల్లో పాల్గొన్న బాలీవుడ్ నటుడు రణ్‌వీర్‌సింగ్ కాంతార మూవీ గురించి మాట్లాడాడు. రిషబ్‌శెట్టి అద్భుతంగా నటించారంటూ.. హీరో పాత్రలోకి దెయ్యం ఎంటరైన సన్నివేశాలు బాగున్నాయని కామెంట్ చేశాడు. అదే విధంగా ఆ మూవీలో ఎంతో వైరలైన 'ఓ..' అనే శబ్దాన్ని స్టేజ్‌పై చేసి చూపించాడు. అయితే ఆయన దాన్ని కామెడీగా చేయడంతో కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రణ్‌వీర్ క్షమాపణ చెప్పాలని పోస్టులు పెడుతున్నారు.

## ఎవరిష్టం వారిది

స్టార్ హీరోయిన్ల లిస్టులో ఒకప్పుడు టాప్‌లో నిలిచిన పేరు రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన క్యూట్ లుక్స్, స్మార్ట్ యాటిట్యూడ్, బబ్లీ ఎనర్జీతో ఫ్యాన్స్ హార్ట్‌ని కొల్లగొట్టింది ఈ పంజాబీ సుందరి. పెండ్లి తర్వాత గ్లామర్ షోతో మరింత రెచ్చిపోతుంది. భగ్నాని కుటుంబం కోడలైన తర్వాత ఆమె లుక్స్ మరింత హాట్‌గా మారాయి. స్టైలింగ్, డ్రెస్ సెన్స్, అందాల ఆరబోతతో పలు ఫొటోషూట్లు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది. దీని గురించి రకుల్ మాట్లాడుతూ 'సాధారణంగా పెళ్లయితే హీరోయిన్ల పని అయిపోయినట్లే అనే భావన ఉంది. అయితే అది తప్పు. నా విషయంలో అలా జరగడం లేదు. నాకు సంబంధించినంతవరకు అందాల ఆరబోత అనేది వారి వారి ఇష్టాన్ని బట్టి ఉంటుంది. అందం హద్దులను పెండ్లి చెరిపేయదు. పైగా ప్రోత్సహించే నిచ్చెనలా పని చేస్తుంది' అంటూ చెప్పుకొచ్చింది. ఇక రకుల్ సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్‌లో తాజాగా విడుదలైన 'దే దే ప్యార్ దే 2' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. అజయ్ దేవ్‌గణ్ మరోసారి తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించగా, రకుల్ ప్రీత్ సింగ్‌కు ఈ చిత్రం ఎనర్జిటిక్ కమ్‌బ్యాక్‌గా మారింది.



## చిరంజీవి అందరినీ సర్‌ప్రైజ్ చేస్తారు

**: అనిల్ రావిపూడి**



'మన శంకర వరప్రసాద్ గారు'గా ఈ సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి దర్శకుడు ఒక ఈవెంట్‌లో మాట్లాడారు. 'మన శంకర వరప్రసాద్ గారు' అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుందన్నారు. ''గత సంక్రాంతి కంటే ఈసారి డబుల్ బొనాంజ ఉంటుంది. చిరంజీవిని మనం ఎప్పటి నుంచో చూడాలనుకుంటున్న పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు ఎంతో నచ్చిన జానర్. ఆయన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటించి 20 ఏళ్లు దాటింది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఆయన ఈ జానర్‌తో రానున్నారు. గతంలో ఇలాంటి కథల్లో ఆయన ప్రేక్షకుల ముందుకు వచ్చి ఎన్ని బ్లాక్‌బస్టర్లు అందుకున్నారో తెలిసిందే. ఈ సినిమాతో చిరంజీవి అందరినీ సర్‌ప్రైజ్ చేయనున్నారు. ఇప్పటికే 'మీసాల పిల్ల' సూపర్ హిట్ అయింది. త్వరలోనే ఇంకో సాంగ్ విడుదల చేయనున్నాం. షూటింగ్ పూర్తవ్వగానే ప్రచారాన్ని ప్రారంభిస్తాం. ప్రేక్షకుల ఆదరణతోనే ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో పలకరిస్తా'' అని అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ దశలో ఉంది. అనిల్ మార్క్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్. ప్రముఖ నటుడు వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేయనున్నారు. దీంతో అందరిలో ఆసక్తి నెలకొంది.

## వేసవిలో శ్రీలీల ప్రేమ కబుర్లు



తన స్టెప్పులతో యువతను విశేషంగా ఆకట్టుకునే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ డ్రామాకు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే తెరపైకి రావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు దీన్ని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా మే 1న థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భావోద్వేగాలు, సంగీతమే ప్రధాన ఆకర్షణగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఓ ప్రముఖ సంగీత దర్శకుడు అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు 'తూ మేరి జిందగీ హై' అనే పరిశీలనలో ఉంది. మరి దక్షిణాదిలో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోన్న శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి బాలీవుడ్ ప్రేక్షకులకు ఎలాంటి ప్రేమకబుర్లు చెప్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## అనుపమ పరమేశ్వరన్ ప్రతిభతో ప్రయాణం

తన సొగసైన శైలి, భావ వ్యక్తీకరణ కళ్ళు మరియు స్థిరమైన వైఖరికి పేరుగాంచిన అనుపమ, "కార్తికేయ 2", "బటర్‌ఫ్లై" వంటి చిత్రాలలో మరియు నటిగా ఆమె పెరుగుతున్న పరిణతిని హైలైట్ చేసే రాబోయే ప్రాజెక్టులలో పాత్రలతో అభివృద్ధి చెందుతూనే ఉంది. ప్రతి ప్రదర్శనతో, ఆమె కేవలం అందమైన ముఖం మాత్రమే కాదు, అర్థవంతమైన కథ చెప్పడానికి కట్టుబడి ఉన్న కళాకారిణి అని నిరూపిస్తుంది.



## కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత

బెంగళూరు (చిత్రదుర్గం): గత నాలుగు దశాబ్దాలకు పైగా 350 చలన చిత్రాల్లో నటించిన ప్రముఖ కన్నడ హాస్య నటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం ఆసుపత్రిలో చివరిశ్వాస విడిచారు. ఉమేశ్ మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్ సిద్ధరామయ్య, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.బాల నటుడిగా రంగస్థలంపై ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన ఉమేశ్ 1960లో 'మక్కల రాజ్య'తో కన్నడ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. 1976లో వచ్చిన 'కథా సంగమ' విజయాన్నిఅందించింది. అక్కడ నుంచి వెనుదిరిగి చూడలేదు. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా అదే సినిమాగానూ కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డు వరించింది. 'గురు శిష్యారు', 'అపూర్వ సంగమ' తదితర చిత్రాల్లో విభిన్న పాత్రలతో కన్నడ ప్రేక్షకులను అలరించారు. రాజ్‌కుమార్, విష్ణు వర్ధన్, అంబరీశ్, శివాజీ గణేశన్, రజనీకాంత్ తదితర ప్రముఖులతో కలిసి నటించారు. ఆయన ఆఖరి చిత్రం 'డేర్‌డెవిల్ ముస్తఫా' (2023).



Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.